సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి. మార్కెట్‌కు 627 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.6

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.6, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.4.50 ప్రకారం పలికింది.

గరిష్టం/కనిష్టం
38.8°/21.4°

జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. మధ్యాహ్నం వరకు తీవ్ర ఉక్కపోత నెలకొంది. ఆ తర్వాత ఆకాశం మేఘావృతమైంది. సాయంత్రం తర్వాత చాలా ప్రాంతాల్లో వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



అనంతపురంలోని ఓ కేంద్రంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 5వ తరగతి ప్రవేశ కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 8,774 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 7,650 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు లేపాక్షి విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. మొత్తం 42 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించామన్నారు. జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శివరంగ ప్రసాద్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ మోహన్ రామ్, జిల్లా మత్స్యశాఖ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ కృష్ణనాయక్ తదితరులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారని వెల్లడించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

కొత్తచెరువు: జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లోని ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు సూచించారు. మౌలిక వసతులు కల్పనలో ఏ శాఖ కూడా నిర్లక్ష్యం వహించరాదన్నారు. శనివారం ఆయన కొత్తచెరువు సమీపంలోని జగనన్న హౌసింగ్ లేఅవుట్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, లేఅవుట్‌లో 177 ఇళ్లు మంజూరు కాగా, 17 మాత్రమే పూర్తయ్యాయన్నారు. 36 బిలో బేస్మెంట్‌స్థాయిలో, 103 బేస్మెంట్ స్థాయి, 8 ఆర్‌ఎల్ స్థాయి, 10 ఆర్‌సీ స్థాయిలో ఉన్నాయన్నారు. లేఅవుట్‌లోని ఇళ్ల నిర్మాణాలన్నీ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. అలాగే లేవుట్‌లో నీటి, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇళ్ల నిర్మాణాల పురోగతిపై దృష్టి సారించాలన్నారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, తహసీల్దార్ రామాంజనేయులు రెడ్డి, ఏఈలు రమణారెడ్డి, వెంకటేష్ నాయక్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

వేగవంతంగా కనెక్షన్లు

ఉమ్మడి అనంతపురం జిల్లా అంటేనే బోర్ల ఆధారిత వ్యవసాయం. బోర్లు ఉన్నా దానికి తగ్గట్టుగా కరెంటు ఉంటేనే రైతులకు నాలుగు రూపాయలు వచ్చేది. కానీ ఒకప్పుడు జిల్లాలో వ్యవసాయ కనెక్షన్ కావాలంటే విద్యుత్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇక ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే కనీసం ఏడాదిన్నర దాటినా వచ్చేది కాదు. దీంతో రైతులు పంటలు చేతికందక అప్పులపాలయ్యే వారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ పరిస్థితిలో పూర్తిగా మార్పు వచ్చింది. కరెంటుకు ఢోకా లేదు. ఖర్చుకు వెనకాడకుండా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఉచితంగా సరఫరా చేస్తున్నారు.

- అన్నదాతకు అండగా..
- గతంలో మాదిరిగా ఎదురుచూపుల్లేవు
- దరఖాస్తు చేసిన పది రోజుల్లోనే మంజూరు
- ఒక్క ఏడాదిలోనే 20వేల వ్యవసాయ కనెక్షన్లు
- వీటి కోసం 5 వేల కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్
- జగన్ సర్కార్ చర్యలపై రైతుల్లో హర్షాతిరేకం



అనంతపురం జిల్లాలో నియోజకవర్గాల వారీగా వ్యవసాయ కనెక్షన్లు	
నియోజకవర్గం	కనెక్షన్లు
అనంతపురం అర్బన్	229
రాయదుర్గం	30,147
శింగనమల	51,247
తాడిపత్రి	16,201
ఉరవకొండ	24,871
గుంతకల్లు	13,255
కళ్యాణదుర్గం	31,457

శ్రీసత్యసాయి జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు	
నియోజకవర్గం	కనెక్షన్లు
ధర్మవరం	23,145
హిందూపురం	8,067
కదిరి	17,879
మడకశిర	18,548
పెనుకొండ	17,884
పుట్టపర్తి	24,150
రాప్తాడు	34,125

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను రికార్డు స్థాయిలో మంజూరు చేశారు. వాల్టా చట్టం కింద మార్పులు రావడం, భూగర్భ జలాలు ఎక్కువగా ఉండటంతో బోర్లు వేసుకునేందుకు నిషేధిత జాబితా నుంచి మండలాలకు ఊరట లభించడంతో వేలాది మంది రైతులు బోర్లు వేయించారు. బోర్లు వేసుకుని వ్యవసాయ కనెక్షన్‌కు దరఖాస్తు చేసుకున్న 10 రోజుల్లోనే అధికారులు మంజూరు చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 20 వేల కొత్త వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరు చేశారు.

5 వేల ట్రాన్స్‌ఫార్మర్లు

ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ కొనుగోలు చేయాలంటే ప్రభుత్వానికి రూ.3 లక్షల వ్యయం అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఒక్క ఏడాదిలోనే శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో నూతన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం 5వేల ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఒకప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే రెండేళ్లు కూడా పట్టేది. దీంతోపాటు లో వోల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోయి పంటలు ఎండిపోయేవి. ఇప్పుడు అలాంటి పరిస్థితి మచ్చుకు కూడా కనిపించలేదు. ఎవరైనా రైతు ట్రాన్స్‌ఫార్మర్ కావాలని విద్యుత్ శాఖకు దరఖాస్తు చేసుకుంటే 15 రోజుల్లోనే ఇస్తున్నారు. గతంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు వెయిటింగ్ సమయం కనీసం 8 నెలలు ఉండేది. ఇప్పుడా కాలాన్ని 15 రోజులకు తగ్గించారు. మరో వైపు 20 కొత్త సబ్‌స్టేషన్‌లు రెడీ అవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 3 లక్షలకు పైగా వ్యవసాయ కనెక్షన్లు ఉండగా.. వీటి సబ్సిడీని ప్రభుత్వమే భరిస్తోంది. ఎక్కడా కోత లేకుండా కరెంటు సరఫరా చేస్తూ అన్నదాతకు అండగా జగన్ సర్కారు నిలుస్తోంది.

20 రోజుల్లోనే కనెక్షన్ ఇచ్చారు



రాష్ట్ర ప్రభుత్వం అడిగిన వెంటనే వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేస్తోంది. నేను నెల రోజుల కిందట దరఖాస్తు చేసుకోగా, 20 రోజుల్లోనే మంజూరు చేశారు. సాగునీరు కూడా పుష్కలంగా ఉండటంతో సరైన సమయంలో పంటకు నీళ్లు పెట్టుకోగలిగాను.

– రవీందర్‌రెడ్డి, దంట్లపల్లి, కొత్తచెరువు మండలం

గతంలో తీవ్ర ఇబ్బందులు పడ్డాం



గతంలో వ్యవసాయ కనెక్షన్‌ల కోసం ఏళ్లుగా నిరీక్షించాల్సిన పరిస్థితి. నేను కూడా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బోరు వేసుకుని విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసినా అధికారులు మంజూరు చేయలేదు. దీంతో నీళ్లున్నా పంటలు పండించుకోలేకపోయా. ఇప్పుడు పరిస్థితి లేదు. దరఖాస్తు చేసుకున్న వెంటనే కనెక్షన్ మంజూరు చేస్తున్నారు.

– నారాయణరెడ్డి, సద్దలవాండ్లపల్లి, అమడగూరు మండలం

రికార్డు స్థాయిలో వ్యవసాయ కనెక్షన్లు



గత ఏడాది అంటే 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఎప్పుడూ లేనంతగా 20 వేల వ్యవసాయ కనెక్షన్లు ఇచ్చాం. వీరి కోసం 5వేల ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఏర్పాటు చేశాం. ఎక్కడా లోవోల్టేజీ సమస్య లేదు. కోతలు లేని నాణ్యమైన కరెంటు సరఫరా చేస్తున్నాం.

– సురేంద్ర, ఎస్‌ఈ, ఎస్పీడీసీఎల్

జేఈఈ మెయిన్స్‌లో అదరగొట్టారు

కదిరి విద్యార్థి జశ్వంత్‌రెడ్డికి 419వ ర్యాంకు



కె.జశ్వంత్‌రెడ్డి, ఈక్షిత్ సాయి గుణకర్, హర్బానుఖానమ్

కదిరి/చెన్నేకొత్తపల్లి: దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జేఈఈ మెయిన్-2023 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. కదిరి విద్యార్థి కె.జశ్వంత్‌రెడ్డి 99 శాతం మార్కులతో ఆల్ ఇండియా స్థాయిలో 419వ ర్యాంకు సాధించాడు. ఏప్రిల్ 6 నుంచి 15 వరకూ జేఈఈ మెయిన్స్ పరీక్షలు నిర్వహించగా, దేశ వ్యాప్తంగా 9 లక్షల మందికిపైగా విద్యార్థులు రాశారు. జాతీయ పరీక్షల సంస్థ(ఎన్‌టీఏ) శనివారం ఉదయం ఫలితాలు విడుదల చేసింది. మెరుగైన ర్యాంకుతో జాతీయ స్థాయిలో మెరిసిన జశ్వంత్ తండ్రి రఘునాథరెడ్డి కదిరి మండలం కొండమనాయునిపాళ్యంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా, తల్లి బండ్లపల్లి సుజని గృహిణి.

- కదిరి మున్సిపల్ ఉన్నత పాఠశాల టీచర్ మల్లెల సుధాకర్ కుమారుడు కులదీపేశ్వర్ సైతం ఓబీసీ కోటాలో ఆల్ ఇండియా స్థాయిలో 1,810వ ర్యాంకు సాధించాడు.
- చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన పసల ఈక్షిత్‌సాయి గుణకర్ జాతీయ స్థాయిలో 4,798 ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు కొండన్న, అలివేలు మంగమ్మలు స్వీట్లు పంచి ఆనందం వ్యక్తం చేశారు.
- పెనుకొండకు చెందిన పఠాన్ హర్బానుఖానమ్ ఓబీసీ కేటగిరీలో 557వ ర్యాంకు, బి.చరణ్ 2,692వ ర్యాంకు సాధించారు.

ముగ్గురు ఎస్‌ఐలకు పోస్టింగ్

కొత్తచెరువు: వీఆర్‌లో ఉన్న ముగ్గురు ఎస్‌ఐలకు పోస్టింగ్‌లు ఇస్తూ ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్ పొందిన వారిలో వీరేష్ (పుట్టపర్తి అర్బన్), బాబ్జాన్ (కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్), నాగేంద్ర (జిల్లా క్రైం రికార్డుల బ్యూరో - పుట్టపర్తి పీఎస్) ఉన్నారు.

జనమంతా జగన్ వెంటే



సమావేశంలో ప్రజామద్దతు పుస్తకాలు చూపుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, నాయకులు

- 'జగనన్నే మా భవిష్యత్'కు విశేష ఆదరణ
- రాష్ట్రంలోని 1.10 కోట్ల కుటుంబాలు సీఎం జగన్‌కు మద్దతు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ

పెనుకొండ: వివిధ సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కే జనమంతా మద్దతుగా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి వచ్చిన విశేష స్పందనే ఇందుకు నిదర్శనమన్నారు. శనివారం ఆయన పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 7 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించగా, రాష్ట్రంలోని 1.65 కోట్ల కుటుంబాలకుగాను 1.45 కోట్ల కుటుంబాల వారు జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలిపారని, 1.10 కోట్ల కుటుంబాల వారు 8296082960 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి తామంతా జగన్ వెంటేనని చాటి చెప్పారన్నారు. ఇంతటి ప్రేమ చూపిన ప్రజానీకానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. జిల్లాలోనూ 80 శాతానికిపైగా ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతున్నారన్నారు.

ఆత్మ విమర్శ చేసుకో బాబూ

రాష్ట్రంలోని ఎస్సీ, బీసీ వర్గాలను వైఎస్సార్ సీపీ మోసం చేసిందని గగ్గోలు పెడుతున్న చంద్రబాబు ఒక్కసారి తన పాలనలో ఎస్సీ, బీసీ, మైనార్టీలకు ఏం చేశారో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. జగనన్న 139 వెనుకబడిన కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి 700 మందికిపైగా డైరెక్టర్‌లను నియమించారన్నారు. అలాగే ఏకంగా నలుగురు బీసీలను రాజ్యసభకు పంపిన ఘనత జగనన్నకు దక్కిందన్నారు. నవరత్నాల పథకాల ద్వారా రూ. 2 లక్షల కోట్లు ప్రజలకు డీబీటీ ద్వారా అందిస్తే, అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 70 శాతం అందాయన్నారు. సమావేశంలో నాగలూరుబాబు, బోయనరసింహ, ఉమర్ ఫారూక్, సునీల్, రఘునాథరెడ్డి, రామాంజనేయులు, శ్యాంనాయక్, ఇమాంవలి, సమర, రాము పాల్గొన్నారు.

- సంపూర్ణ పోషణ ప్లస్ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలి
- అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

మాతాశిశు మరణాలు నివారించాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: మాతాశిశు మరణాలు సంభవించకుండా ముందస్తుగా తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మాతాశిశు మరణాలపై ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అత్యాధునిక వైద్య సదుపాయాలు, ఆధునిక టెక్నాలజీ ఉన్న నేటి రోజుల్లోనూ మాతాశిశు మరణాలు సంభవించడం దురదృష్టకరమన్నారు. జిల్లాలో మాతాశిశు మరణాలు సంభవించకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాల్లో జిల్లాలో 24 శిశు మరణాలు, గుండెపోటుతో ఓ మాతృ మరణం సంభవించగా, వాటిపై వైద్యఆరోగ్యశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఏయే కారణాలతో శిశువులు మృత్యువాత పడ్డారన్న అంశాలపై క్షుణ్ణంగా ఆరా తీశారు. శిశువుల మరణాలకు సమగ్ర నివేదిక తయారు చేసి సమర్పించాలని డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డిని ఆదేశించారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ గర్భిణులు, బాలింతలకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలన్నారు.

'సంపూర్ణ పోషణ ప్లస్'ను పటిష్టంగా అమలు చేయాలి..

అనంతరం ఐసీడీఎస్ అధికారులతో సమీక్షించిన కలెక్టర్... ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వచ్చేవారం లోపు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో జిల్లా ముందు వరుసలో ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతల్లో రక్త హీనత సమస్య అధిగమించేందుకు సంపూర్ణ పోషణ ప్లస్ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. 0-5 ఏళ్ల మధ్య ఉన్న చిన్నారులకు ఆధార్ నమోదు వేగవంతం చేయాలన్నారు. ఎదుగదల లోపంతో బాధ పడుతున్న పిల్లలకు గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఎంపీడీఓలతో వర్చువల్‌గా మాట్లాడి అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై పలు సూచలిచ్చారు.

పీహెచ్‌సీల ద్వారా మెరుగైన సేవలందించాలి..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) ద్వారా గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. జిల్లా వైద్యశాఖ అధికారులతో సమీక్షించిన ఆయన పలు సూచనలు చేశారు. ముఖ్యంగా గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అసంక్రమిత, సంక్రమిత వ్యాధుల సర్వే వేగవంతం చేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. అలాగే అసిస్టెంట్ డీఎంహెచ్‌ఓలు, వివిధ ప్రోగ్రాం ఆఫీసర్లు సంబంధిత మండలాల ఎంపీడీఓలతో కలిసి తరచూ సమీక్షలు నిర్వహించాలన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో రక్తపోటు, మధుమేహంతో బాధ పడుతున్న వారి వివరాల నమోదు సరిగా లేదన్నారు. ఏఎన్‌ఎంలు ఇంటింటికీ వెళ్లి రోజూ వివరాలు సేకరించాలని, వాటిని ఆ రోజే డీఎంహెచ్‌ఓకు పంపాలన్నారు. జిల్లాలోని కనగానపల్లి, లేపాక్షి, చిలమత్తూరు దుర్గానగర్, కదిరేపల్లి, మడకశిర ఆరోగ్య కేంద్రాలు వివిధ ప్రమాణికాల్లో వెనుకబడి ఉన్నాయని, 15 రోజుల్లోపు మెరుగుపడాలన్నారు. ఇక ఎన్‌ఎస్ గేట్, కొండాపురం, రెడ్డిపల్లి, అగళి, పరిగి, తాడిమర్రి, కొక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో సీడీ, ఎన్‌సీడీ సర్వే 90 శాతం పూర్తి చేయాలన్నారు. సమీక్ష సమావేశాల్లో డీఆర్‌ఓ కొండయ్య, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, సీపీఓ విజయ్‌కుమార్, నోడలాఫీసర్ శివారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ నివేదిత, డాక్టర్ మంజువాణి, డాక్టర్ కల్పనా సాల్మన్, డాక్టర్ అన్నాద్దీన్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, వైద్యఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్‌బీకేని పరిశీలించిన జెడ్పీ చైర్‌పర్సన్



రైతులతో మాట్లాడుతున్న గిరిజమ్మ

కొత్తచెరువు: స్థానిక రైతు భరోసా కేంద్రాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం వేరుశనగ నూర్పిడి చేస్తున్న రైతులను కలసి దిగుబడిపై ఆరా తీశారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమ ప్రభుత్వం ఉందని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాన్ని సుసంపన్నం చేయాలని ఈ సందర్భంగా రైతులను ఆమె కోరారు.

వికసించిన అరుదైన పుష్పం



వికసించిన కాక్టర్స్ పుష్పం

ఓడీ చెరువు: మండలంలోని గొనిపల్లికి చెందిన జయం శంకరగుప్త ఇంట్లో కాక్టర్స్ రకం మొక్క పుష్పించింది. పదేళ్లకు ఒకసారి పుష్పించే అరుదైన కాక్టర్స్ మొక్కను 15 ఏళ్ల క్రితం రాజమండ్రిలోని కడియం నర్సరీలో కొనుగోలు చేసినట్లు శంకరగుప్త కుమారుడు రాజేష్ తెలిపారు. ఈ పుష్పాన్ని చూస్తూ అదృష్టం వరిస్తుందని ఎంతో మంది విశ్వసిస్తుంటారని పేర్కొన్నారు. కాగా, కాక్టర్స్ మొక్క పుష్పించిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో గుప్త ఇంటిని చేరుకుని ఆసక్తిగా పరిశీలించారు.

విద్యుదాఘాతంతో బిహారీ మృతి



మృతుడు మహమ్మద్ జావేద్

ధర్మవరం అర్బన్: విద్యుత్ షాక్‌కు గురై వలస కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బిహార్‌కు చెందిన మహమ్మద్ జావేద్ (35).. కొన్నేళ్ల క్రితం ధర్మవరానికి వలస వచ్చి నూతన భవనాలకు పెయింటింగ్ పనులతో జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఉదయం స్థానిక అరిగెల పోతన్న రైస్‌మిల్ పక్కనే నూతనంగా నిర్మించిన ఇంటికి రంగులు వేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో షాక్‌కు గురై పైనుంచి కిందపడ్డాడు. అప్రమత్తమైన తోటి పెయింటర్లు వెంటనే జావేద్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చైనా.. చేరుకోలేమా?

- క్రీడల్లో రాణిస్తున్న కేజీబీవీ విద్యార్థినులు
- అంతర్జాతీయ స్థాయి పోటీలకు ముగ్గురి ఎంపిక
- ఆర్థిక భారంతో కుదేలవుతున్న క్రీడాకారిణులు
- దాతల సహకారం అవసరమంటున్న ఉపాధ్యాయులు



సాఫ్ట్‌బాల్ ఆడుతున్న విద్యార్థినులు (ఇన్‌సెట్) నాగరత్నమ్మ ప్రిన్సిపల్, కేజీబీవీ రొద్దం

రొద్దం: వారంతా కస్తూరిబా గురుకుల బాలికల విద్యాలయ (కేజీబీవీ) విద్యార్థినులు. వీరిలో అనాథలు, బడి బయట ఉన్న పిల్లలు, స్కూల్ మధ్యలో మానేసిన డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దారిద్య్రరేఖకు దిగువన ఉన్న బాలికలే అత్యధికంగా ఉన్నారు. అంతా గ్రామీణ వ్యవసాయ కుటుంబ నేపథ్యం ఉన్నవారే. అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న వారు.. అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదిగే సువర్ణ అవకాశాన్ని దక్కించుకున్నారు. అయితే.. ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా కుదేలయ్యారు. దాతలు సహకరిస్తే తప్ప పొరుగున ఉన్న చైనాకు వెళ్లలేని స్థితిలో కుమిలిపోతున్నారు.

సాఫ్ట్‌బాల్ అంటే ఎంతో ఇష్టం..

రొద్దంలోని కేజీబీవీకి చెందిన విద్యార్థినులకు సాఫ్ట్‌బాల్ క్రీడ అంటే ఎంతో ఇష్టం. కళాశాల ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ, పీఈటీ రాధ ప్రోత్సాహంతో జిల్లా, రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారు. వీరిలో వీరిలో రాజేశ్వరి, ఉషారాణి, మౌనిక ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన అండర్–15 సాఫ్ట్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో అసమాన ప్రతిభ కనబరిచి ఈ ఏడాది జూన్‌లో చైనాలో జరిగే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే భారత జట్టులో చోటు దక్కించుకున్నారు. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన ఈ ముగ్గురూ చదువులోనూ అదే స్థాయిలో రాణిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి పోటీల్లో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించే అరుదైన అవకాశం దక్కినా... ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా చైనాకు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్కో విద్యార్థికి చైనాకు పోనురానూ దాదాపు రూ.80 వేల వరకు ఖర్చులు వస్తాయని, ఇంత పెద్దమొత్తంలో సాయం అందించే దాతలు ఎవరైనా ముందుకు వస్తే తప్ప వీరిలోని క్రీడా ప్రతిభ వెలుగు చూసే అవకాశం లేదని ఉపాధ్యాయులు అంటున్నారు. దాతలు ఎవరైనా సాయం చేయదలిస్తే 94412 65509 ఫోన్ నంబర్‌కు కాల్ చేయాలని కోరుతున్నారు.

మా సత్తా ఏమిటో చూపిస్తాం



గ్రామీణ విద్యార్థులనగానే ఓ విధమైన చులకన భావంతో చూస్తుండడం బాధకలిగింది. దీంతో ఎలాగైనా మా సత్తా ఏమిటో చూపాలని అనుకున్నా. చదువుల్లో రాణిస్తూనే మరో వైపు ప్రిన్సిపాల్ మేమ్ ప్రోత్సాహంతో సాఫ్ట్‌బాల్ క్రీడలోనూ ప్రతిభ చాటుకున్నాం. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికమయ్యామనగానే ఎగిరి గంతేశాం. అయితే చైనాకు వెళ్లి వచ్చేందుకు మా ఆర్థిక స్థోమత సరిపోదనగానే ఎంతో నిరుత్సాహానికి గురయ్యాం. దాతలు ఎవరైనా సహకరిస్తే అంతర్జాతీయ స్థాయిలో మా సత్తా ఏమిటో చూపిస్తాం.

– రాజేశ్వరి, 9వ తరగతి

అవకాశాన్ని అందిపుచ్చుకున్నాం



మాది సోమందేపల్లి మండలం జూలకుంట గ్రామం. నాన్న, అమ్మ వ్యవసాయం చేస్తుంటారు. చాలీచాలని సంపాదనతో మమ్మల్ని పోషించలేక ఇబ్బంది పడుతున్నారు. దీంతో రొద్దంలోని కేజీబీవీలో నన్ను చేర్పించి చదివిస్తున్నారు. అమ్మానాన్న కష్టాలను దూరం చేయాలని పట్టుదలతో చదువుకుంటున్నా.. అందివచ్చిన క్రీడావకాశాన్ని సద్వినియోగం చేసుకున్నా. ప్రిన్సిపాల్ మేడమ్, పీఈటీ మేడమ్ ఎంతో ప్రోత్సహిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడంతో చాలా సంతోషపడ్డాను. అయితే చైనాకు వెళ్లి వచ్చేందుకు అవసరమైన డబ్బు లేదు. దాతలు సాయం చేయాలని కోరుతున్నా.

– మౌనిక, 9వ తరగతి

జాతీయ జట్టులో చోటు దక్కింది



మాది రొద్దం మండలం వైటీరెడ్డిపల్లి గ్రామం. సాధారణ వ్యవసాయ కుటుంబం. చదువుల్లోను, క్రీడల్లోనూ ప్రిన్సిపాల్ మేమ్ ఎంతో ప్రోత్సహిస్తోంది. జాతీయ జట్టులో దక్కిందనగానే ఎంతో సంతోషపడ్డాను. అయితే చైనాకు వెళ్లి రావాలంటే అంత డబ్బు మా వద్ద లేదు. దాతలు సహకరిస్తే అంతర్జాతీయ స్థాయి పోటీల్లో భారత్‌ను విజేతగా నిలిపేందుకు నా శక్తియుక్తులన్నీ ధారపోస్తాను.

– ఉషారాణి, 9వ తరగతి

సంఘాల లావాదేవీలు సక్రమంగా నమోదు చేయండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసయ్య

హిందూపురం టౌన్: గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల లావాదేవీలు లోకోస్ యాప్‌లో సక్రమంగా నమోదు చేయాలని సంబంధిత సిబ్బందిని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ఆదేశించారు. లోకోస్ యాప్‌పై హిందూపురంలోని సంఘమిత్ర మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేషనల్ రూరల్ లైవ్లీ హుడ్ మిషన్ ద్వారా దేశ వ్యాప్తంగా గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల లావాదేవీలు, ఇతర కార్యక్రమాల నమోదు ఒకే విధంగా ఉండేలా లోకోస్ ఆన్‌లైన్ యాప్‌ను సెంట్రల్ ప్రాజెక్ట్ రూపొందించినట్లు వివరించారు. ఈ నేపథ్యంలో యాప్ నిర్వహణపై జిల్లా, మండల స్థాయిలో వైకేపీ సిబ్బంది, ఏపీఎం, సీసీలకు శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘ సభ్యురాలి సమాచారం, సంఘం సమాచారం, గ్రామ సంఘాల సమాచారం నమోదు, లావాదేవీల నమోదు అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా స్థాయి, మండల స్థాయిలో శిక్షణ పొందిన వారు గ్రామ స్థాయిలో వీఓఏలకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అనంతరం యాప్ వినియోగంపై పూర్తి స్థాయిలో టీఓటీలు శంకర్, మునెప్ప శిక్షణ ఇచ్చారు. సిబ్బంది సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఫైనాన్స్ డీపీఎం రామిరెడ్డి, ఐబీ డీపీఎం నాగరాజు, డీపీఎం రామ్మోహన్, ఏపీఎంలు, సీసీలు, హిందూపురం, మడకశిర క్లస్టర్ల సిబ్బంది పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనుల్లో నిర్లక్ష్యం తగదు



'నాడు-నేడు' పనులపై సమీక్షిస్తున్న జేసీ టీఎస్ చేతన్

పుట్టపర్తి అర్బన్: పాఠశాలలు పునఃప్రారంభంలోపే 'మనబడి నాడు–నేడు' పనులన్నీ పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో 'మనబడి నాడు–నేడు' పనుల పురోగతిపై పంచాయతీరాజ్, విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, అదనపు తరగతి గదుల నిర్మాణాలన్నీ పూర్తి చేయాలన్నారు. సిమెంటు కొరత లేకుండా చూసుకోవాలన్నారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. పాఠశాలల సుందరీకరణ పనులు, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 740 మరుగుదొడ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 34 మాత్రమే పూర్తయ్యాయని, తక్కినవి జూన్ 5వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. విద్యుద్దీకరణ, ఫ్యాన్లు, ట్యూబ్ లైట్ల ఏర్పాటు పనులు 750 మంజూరు కాగా, 18 మాత్రమే పూర్తయ్యాయన్నారు. వాటిని జూన్ 15వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు.

ఆ ఇద్దరి పనితీరు బాగోలేదు..

పెనుకొండ ఇరిగేషన్ ఈఈ గంగాధర్, మడకశిర పంచాయతీరాజ్ డీఈ పద్మావతి పనితీరు సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత శాఖ అధికారులు ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ మీనాక్షి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రషీద్‌ఖాన్, పీఆర్ ఎస్ఈ గోపాల్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ వెంకటరమణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా 'శ్రీసత్యసాయి'

- మత్తు పదార్థాల వినియోగ దుష్పరిణాలపై అవగాహన కార్యక్రమాలు
- అధికారులకు సూచించిన కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌కుమార్ (చిత్రంలో) ఎస్పీ మాధవరెడ్డి, అధికారులు

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రానున్న నాలుగు నెలల్లోపు శ్రీసత్యసాయి జిల్లాను డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మార్చేందుకు అవసరమైన కార్యాచరణను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నివారణపై శనివారం సాయంత్రం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో వారు సమీక్షించారు. జిల్లాలోకి మత్తు పదార్థాలు రాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కర్ణాటక సరిహద్దు మండలాల్లో పనిచేస్తున్న అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణాలపై కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. కళాశాలలు, పాఠశాలలతో పాటు జిల్లాలోని రద్దీ కూడళ్లు, పట్టణాల్లో అవగాహన హోర్డింగులు ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయం, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల పరిధిలో గంజాయి సాగుదారులను గుర్తించాలని ఆదేశించారు. ఎవరైనా గంజాయితో పట్టుబడితే ఎక్కడి నుండి తెచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారో పూర్తి వివరాలు సేకరించాలన్నారు. డ్రగ్స్‌కు బానిసలైన వారిని డీ అడిక్షన్ సెంటర్‌కు తరలించాలని, 14500 టోల్ ఫ్రీ నంబర్‌పై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్, డీఎస్పీలు గోవింద్, యశ్వంత్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగ ప్రసాద్, పట్టుపరిశ్రమ శాఖ జేడీ పద్మమ్మ, కదిరి ఆర్డీఓ రాఘవేంద్ర, తహసీల్దార్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి



ప్రమాదానికి గురై రోదిస్తున్న రాజేశ్వరి

పుట్టపర్తి టౌన్: బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... పుట్టపర్తిలోని కుమ్మరిపేటకు చెందిన రాజేశ్వరి (58) ఇటీవల పెనుకొండలోని బంధువుల ఇంటికి వెళ్లింది. శనివారం ఉదయం తిరిగి పుట్టపర్తికి చేరుకున్న ఆమె... ఆర్టీసీ బస్టాండ్ వద్ద కుమారుడు పవన్ కుమార్ రాక కోసం వేచి చూస్తోంది. ఆ సమయంలో కదిరికి వెళుతున్న ఆర్టీసీ బస్సు నేరుగా ఆమెను ఢీకొంది. డ్రైవర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ముందుకు పోనివ్వడంతో బస్సు చక్రం ఆమె ఎడమకాలుపై దూసుకెళ్లింది. ఘటనలో కాలు నుజ్జునుజ్జై రోదిస్తున్న రాజేశ్వరిని స్థానికులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పుట్టపర్తి అర్బన్ ఎస్ఐ వెంకటరమణ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



బాలు(ఫైల్)

గుత్తి రూరల్: విద్యుత్ షాక్‌కు గురై ఓ యువరైతు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం తురకపల్లికి చెందిన చాకలి బాలు (30), లక్ష్మీదేవి దంపతులు తమకున్న నాలుగు ఎకరాల పొలంలో వ్యవసాయ పనులతో పాటు పాడి పశువులు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం రాత్రి పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పశువుల పాక సమీపంలో విద్యుత్ తీగ తెగిపడింది. శనివారం ఉదయం 6 గంటలకు పశువులను పాకలో కట్టేందుకు సిద్ధమైన బాలు.. తెగిపడిన విద్యుత్ తీగను గమనించి పక్కకు తొలగించేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో విద్యుత్ ప్రసారం జరగడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై కుప్పకూలాడు. పశువుల పాకలోకి వెళ్లిన భర్త ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో భార్య లక్ష్మీదేవి వెళ్లి చూసింది. అపస్మారకంగా పడి ఉన్న భర్తను చూసి గట్టిగా కేకలు వేస్తూ చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేసింది. స్థానికులు వెంటనే బాలుని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.


పశుసంవర్ధకశాఖకు రాష్ట్ర స్థాయి అవార్డు

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసిన జిల్లా పశుసంవర్ధకశాఖకు రాష్ట్ర స్థాయి అవార్డు దక్కింది. ఈ మేరకు ఆ శాఖ జిల్లా అధికారి డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం 'సాక్షి'కి తెలిపారు. శనివారం విజయవాడ వేదికగా పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఓ కార్యక్రమంలో ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్ నుంచి ప్రశంసాపత్రం, జ్ఞాపికను ఆయన అందుకున్నారు. పశుశాఖ పథకాల అమలులో మొదటి స్థానంలో శ్రీకాకుళం, రెండో స్థానంలో బాపట్ల ఉండగా మూడో స్థానంలో అనంతపురం జిల్లా నిలిచింది. అలాగే డివిజన్ల విషయానికి వస్తే మొదటి స్థానంలో శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఉండగా రెండో స్థానంలో ఉరవకొండ డివిజన్‌కు అవార్డు దక్కింది. డివిజన్లకు సంబంధించిన అవార్డును ఉరవకొండ డీడీ డాక్టర్ కె.వెంకటేష్ అందుకున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా ప్రభుత్వం నిర్దేశించిన పథకాలు మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు.

వైద్యం కోసం వచ్చి మృత్యుఒడికి..

కళ్యాణదుర్గం: వైద్యం కోసం వచ్చిన ఓ మహిళ.. ఉన్నఫళంగా కుప్పకూలి మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లికి చెందిన ఎరికల గంగమ్మ (57), ఎర్రిస్వామి దంపతులు. వీరికి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న గంగమ్మ.. శనివారం సాయంత్రం చికిత్స చేయించుకునేందుకు కళ్యాణదుర్గానికి వచ్చింది. అనంతరం వైద్యుడు రాసిచ్చిన మందులు కొనుగోలు చేసేందుకు టీ సర్కిల్ సమీపంలోని మెడికల్ స్టోర్ వద్దకు చేరుకోగానే కుప్పకూలిపోయింది. స్థానికులు వెంటనే ఆమెను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఔట్ పోస్టు పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న మృతురాలి కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన బాలికల సాఫ్ట్‌బాల్ జట్టు

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపికలను అనంత క్రీడా గ్రామంలోని విన్సెంట్ క్రీడా మైదానంలో శనివారం నిర్వహించారు. పిచ్చింగ్, క్యాచింగ్, బ్యాటింగ్ విభాగాల్లో ప్రతిభ కనబరచిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. ఎంపికైన బాలుర జట్టులో శశి, అరవింద్, అరవింద్‌రెడ్డి, జగదీష్, సాయి, రంజిత్, ముబారక్, అక్షయ్, నరసింహ, గణేష్, అంజి, సునీల్, సాయికుమార్, బస్వంత్, మనోహర్, భాను, శంకర్, సాయికుమార్, మోక్షిత్‌వర్మ, సాదిక్ ఉన్నారు. అలాగే బాలికల జట్టులో రాజేశ్వరి, అనూష, శిరీష, అమిదాబి, గౌరీప్రియ, ఉషారాణి, కీర్తన, మౌనిక, కల్పన, లోహిర, అనూష, హేమలత, ఫాతిమా, షబీనా, మౌనిక చోటు దక్కించుకున్నారు. ఎంపికలను రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు, ఆర్డీటీ గ్రాస్ రూట్ లెవల్ కో–ఆర్డినేటర్ ఓబులేసు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు కేశవమూర్తి, గోపాలరెడ్డి, ఫక్కీరప్ప, ప్రభాకర్, లతాదేవి, హిమబిందు, రామాంజినమ్మ, గంగ, కోచ్‌లు పర్యవేక్షించారు.

వికటించిన బెదిరింపు!

లేపాక్షి: డబ్బు కోసం కుటుంబసభ్యులను బ్లాక్ మెయిల్ చేస్తూ బెదిరించేందుకు ప్రయత్నించిన ఓ మహిళ చివరకు ప్రాణాలు కోల్పోయింది. పోలీసులు తెలిపిన మేరకు.. లేపాక్షి మండలం శిరివరం గ్రామానికి చెందిన గంగరత్నమ్మ (54), గంగప్ప దంపతులు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కల్లుకు బానిసైన గంగరత్నమ్మ ఈ నెల 25న కుమార్తెకు సీమంతానికి అయిన ఖర్చు మొత్తం తానే భరించింది. మరుసటి ఆ రోజు ఆ డబ్బు మొత్తం ఇవ్వాలంటూ కల్లు సేవించిన మత్తులో కుమారుడితో గొడవ పడింది. రెండ్రోజుల తర్వాతిస్తానని కుమారుడు తెలిపినా ఆమె వినలేదు. తనకు ఇప్పుడే కావాలని, లేకపోతే ఎక్కడికైనా వెళ్లి చస్తానని బెదిరింపులకు దిగింది. గతంలోనూ ఆమె ఇదే విధంగా బ్లాక్‌మెయిల్ చేసి కుటుంబసభ్యుల నుంచి డబ్బు లాక్కొనేది. దీంతో ఆమె బెదిరింపులను కుటుంబ సభ్యులు ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆవేశానికి లోనైన ఆమె నేరుగా వెళ్లి రైతు గంగిరెడ్డి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మూడు రోజులుగా ఆమె కోసం కుటుంబసభ్యులు గాలిస్తున్నా ఆచూకీ చిక్కలేదు. శనివారం ఉదయం బావిలో మృతదేహం తేలడంతో ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లుగా వెలుగు చూసింది. ఘటనపై గంగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రతి శనివారం హౌసింగ్ డే

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ప్రతి శనివారం ప్రభుత్వ కార్యాలయాల్లో హౌసింగ్ డే నిర్వహించి లబ్ధిదారుల సమస్యలను అర్జీల రూపంలో స్వీకరిస్తామని హౌసింగ్ పీడీ కేశవనాయుడు తెలిపారు. శనివారం ఇన్‌చార్జ్ జెడ్పీ సీఈఓ అమృతరాజుతో కలసి కూడేరు కేజీబీవీ సమీపంలోని జగనన్న లేవుట్‌తో పాటు ఉరవకొండ కొలిమి లేఅవుట్, రాయంపల్లి లేవుట్‌లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఉరవకొండ, కూడేరు ఎంపీపీలు చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, నారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, తహసీల్దార్ షాబుద్దీన్, ఎంపీడీఓ చంద్రమౌళి, హౌసింగ్ డీఈ వరప్రసాద్ పాల్గొన్నారు.

అర్హత గల ప్రతి ఒక్కరికీ పింఛన్

అనంతపురం: అర్హత గల ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పింఛన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి ఆదేశించారు. శనివారం నిర్వహించిన జిల్లా సమాఖ్య షెడ్యూల్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రధానమైన అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జిల్లా సమాఖ్య హెల్త్ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. వారానికి ఒక సారి చిరుధాన్యాలు వినియోగించేలా సభ్యులను చైతన్యపరచాలన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ పీడీ బి.ఈశ్వరయ్య, జీవనోపాధుల ప్రాజెక్ట్ మేనేజర్ రాధారాణి, డీపీఎం ఫైనాన్స్ ఎం.సత్యనారాయణ, ఉన్నతి ఏపీఎం సుభద్రమ్మ, స్త్రీనిధి ఏజీఎం హనుమేష్ తదితరులు పాల్గొన్నారు.